

ఆర్ట్స్‌కాలేజ్ ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

## ఒయూలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం

తార్నాక, మార్చి 16 ప్రభాతవార్త: ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు తుంగబాలు ఆరోపించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శనివవారం ఒ.యూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద బీఆర్ఎస్వీ ఆద్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసిన అనంతరం గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగబాలు మాట్లాడుతూ కవిత అరెస్టు ముమ్మాటికి రాజకీయ కుట్రే అని ఆరోపించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలహీన ప ర్చాలని కాంగ్రెస్, బీజేపీలు కలిసి చేసిన కుట్రనే కవిత అరెస్టు అన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. రాజకీయ ప్రత్యర్థులను లొంగదీసుకునేం దుకే బిజేపి ఇలాంటి చర్యలకు పాల్పడిందన్నారు. సిటీ 3లో



# హైదరాబాద్ వార్త



# మోగిన ఎన్నికల గంట

- షెడ్యూలు విడుదలతో మొదలైన వేడీ
- గ్రేటర్ పరిధిలో నాలుగు ఎంపి స్థానాలు
- అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమైన పార్టీలు
- 2019లో ఒక్కోపార్టీనుంచి ఒక్కో ఎంపి గెలుపు
- ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ హవా
- అధికారం కోల్పోవడంతో ఒకొక్కరుగా చేజారుతున్న నేతలు
- దీంతో పార్లమెంట్ ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ

హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త: లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగింది. మే 13న పోలింగ్ నిర్వహించి జూన్4న ఫలితాలు ప్రకటిం చనున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రారంభ తేదీ ఏప్రిల్ 18 నుంచి 25వరకు అవకాశం కల్పించారు. ఈనేపథ్యంలో రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో నిమగ్నమయ్యాయి. అయితే గత పార్లమెంట్ ఎన్నికల్లో తొలివిడతలోనే ఎన్నికలు జరగగా ఈసారి 4వ విడుతలో తెలంగాణలో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం అన్ని పార్టీలు ఒంటరిగానే పోటీ చేయబోతున్నాయి. దీంతో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవేళ్ల స్థానాలపై పార్టీలు గురిపెట్టాయి. నామినేషన్ల స్వీకరణకు మరో నెలరోజు ఉండటంతో ఇక్కడ పైచేసి సాధించేందుకు ప్రధానపార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్,బిజెపిలు ఇప్పటికే వ్యూహరచన చేస్తున్నాయి. గెలుపు గుర్రాలనే బరిలో దించాలని ఆశావాహును వడబోస్తున్నాయి. అయితే తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన బిఆర్ఎస్ గతేడాది జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఆపార్టీ ఎక్కువగా సీట్లు దక్కించుకోలేకపోయినా గ్రేటర్‌లో మాత్రం పట్టునిలుపుకుంది. దీంతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయా లేక మరోలా తీర్పును ఇస్తారా అనేది ప్రస్తుతం ఆసక్తిగా మారింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని నాలుగు స్థానాలను నాలుగు వేర్వేరుపార్టీలు గెలుచుకున్నాయి. హైదరాబాద్‌లో ఎంఐఎం విజయం సాధించగా.. సికింద్రాబాద్‌లో బిజెపి, చేవెళ్లలో బిఆర్ఎస్, మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్‌పార్టీలు విజయం సాధించాయి.

**అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ హవా..** గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో (చేవెళ్లతోపాటు )25 అసెంబ్లీ స్థానాల్లో ఉంటే అందులో 17స్థానాల్లో బిఆర్ఎస్ విజయం సాధించింది. ఏడుస్థానాల్లో ఎంఐ ఎం పట్టునిలుపుకుంది. ఒక స్థానంలో బిజెపి విజయం సాధించింది. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలల్లో మలక్‌పేట్, కార్వాన్, చార్మినార్, చంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహుదూర్‌పురా ఎంఐఎం పార్టీ గెలిచింది. గోషామహల్ స్థానం బిజెపి దక్కించుకుంది. అలాగే సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముషీరాబాద్, అంబర్‌పేట్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ గెలిచింది. నాంపల్లిలో మాత్రం ఎంఐఎం గెలుపొందింది.

అలాగే మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే అందులో మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానాల్లో గులాబీ పార్టీ విజయం సాధించింది.

**గ్రేటర్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తారా..?** ఈసారి పార్లమెంట్ ఎన్నికలను అనిపార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గ్రేటర్‌లో గెలుపేలక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. అయితే ఈకీలక సమయంలో బిఆర్ఎస్ పార్టీ కి మాత్రం వరుస ఎదురుదెబ్బలు తప్పడం లేదు. అధికారం కోల్పో వడంతో ఒకొక్కరుగా కీలకనేతలు ఆపార్టీకి రాజీనామా చేసి వివిధ కారణాలతో కాంగ్రెస్, బిజెపిలో చేరుతున్నారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలకు ముందే గ్రేటర్‌లో కారును ఖాళీ చేయాలని కాంగ్రెస్ వ్యూహా లు రచిస్తుంది. ఇప్పటికే మాజీ మేయర్, డిప్యూటీ మేయర్ అందరూ కాంగ్రెస్‌లో చేరిపోయారు. అలాగే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానంనాగేం దర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు కాంగ్రెస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

**కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్..** పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలోని సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, స్థానాలను హస్తగతం చేసుకోవాలని భావిస్తుంది. సికింద్రాబాద్ ప్రస్తుతం బిజెపి ఖాతాలో ఉంది. అక్కడి నుంచి రాష్ట్ర అధ్యక్షులు ,కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి బరిలో ఉన్నారు. అయితే ఈసారి సికింద్రాబాద్ స్థానంపై కూడా కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు సికింద్రాబాద్ టికెట్ కేటాయిస్తారని ప్రచారం జరుగుతుంది. మరోవైపు మల్కాజ్‌గిరి ఎంపి స్థానం ప్రస్తుతం కాంగ్రెస్ ఖాతాలోనే ఉంది. ఇక్కడి నుంచి గత లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి సిఎం పదవి దక్కించుకున్నాడు. దీనికి కూడా చేజారిపోకుండా భారీ మెజార్టీతో గెలవాలని భావిస్తున్నారు. అయితే ఇక్కడ బిజజెపి అభ్యర్థిగా ఈటెల రాజేందర్, బిఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిలు బరిలో ఉండగా కాంగ్రెస్ మాత్రం ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు.



# యశోద చెర వీడిన.. హైటెక్ సిటీ రహదారి

'ప్రభాతవార్త' కథనంతో కదిలిన అధికారులు ● అడ్డంగా వున్న ఇనప కంచె తొలగింపు

అందుబాటులోకి 30 అడుగుల రోడ్డు ● వాహనదారులకు తొలగిన ట్రాఫిక్ సమస్య



రహదారిలోనే లాన్‌ను నిర్మించడంతో ఇంకా యశోద చెరలోనేవున్న పదడుగుల రోడ్డు



యశోద హాస్పిటల్ వేసిన ఇనుపకంచెను తొలగించడంతో తిరిగి అందుబాటులోకి వచ్చిన 30 అడుగుల రహదారి

✍ (సైబరాబాద్ ప్రతినిధి - ప్రభాతవార్త)

**హైటెక్ సిటీలో అత్యంత రద్దీగావుండే రహదారికి గ్రహణం వీడింది. హైటెక్‌సిటీ రోడ్డులో యశోద ఆసుపత్రి కబ్జాచేసిన 30 అడుగుల రహదారి నూతనంగా వాహనదారులకు అందుబాటులోకి వచ్చింది. 'యధేచ్ఛగా రోడ్డును మింగిన యశోద హాస్పిటల్' అనే శీర్షికన 'వార్త' దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి శనివారం జిహెచ్ఎంసి అధికారులు స్పందించారు. చందానగర్ సర్కిల్ ఎసిపి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది 150 అడుగుల రహదారిని ఆక్రమించి యశోద ఆసుపత్రి యాజమాన్యం వేసుకున్న ఇనప కంచెను పూర్తిగా తొలగించారు. దీంతో ఇక్కడ రోడ్డు సువిశాలమై గతకొంతకాలంగా వాహనదారులు పడుతున్న ఇక్కట్లకు పరిష్కారం లభించినట్లయింది.**

**ఇంకా పదడుగుల రోడ్డు యశోద కబ్జాలోనే**

గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ కూడళి నుంచి కూకట్‌పల్లి జెఎన్‌టియు వరకు అత్యంత రద్దీగావుండే పది కిలోమీటర్ల రహదారిలో దాదాపుగా మధ్యలో ఇటీవల యశోద ఆసుపత్రి యాజమాన్యం తమ నూతన శాఖను ప్రారంభించింది. 150 అడుగుల విస్తీర్ణముండే ఈ రహదారిలో డివైడర్ మధ్యనుంచి యశోద ఆసుపత్రి వైపుకు 75 అడుగుల రోడ్డు ఉండాలి. ఇందులో యశోద ఆసుపత్రి దాదాపు 40 అడుగుల మేర ఆక్రమించి తమ ఆసుపత్రికి వచ్చే వాహనాలకోసం ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేసుకోవడంతోపాటు లాన్‌ను సైతం నిర్మించింది. దీంతో హైటెక్‌సిటీ వైపు నుంచి వచ్చే వాహనదారులు సాయంత్రం సమయంలో యశోద ఆసుపత్రి వద్ద రద్దీ పెరిగిపోయి నిత్య నరకాన్ని చవిచూస్తున్నారు. అయితే జిహెచ్ ఎంసి అధికారులు శనివారం యశోద యాజమాన్యం అక్రమంగా వేసుకున్న ఇనుపకంచెను తొలగించగా 30 అడుగుల రహదారి అందుబాటులోకి వచ్చింది. కాగా మరో పది అడుగుల మేరా రోడ్డును ఆక్రమించి వేసుకున్న లాన్ ఇంకా యశోద ఆక్రమణలోనే ఉండిపోయింది. దీన్ని సైతం తొలగించి రోడ్డును పునరుద్ధరిస్తేనే ఇక్కడ వాహనదారుల ట్రాఫిక్ ఇక్కట్లకు శాశ్వ త పరిష్కారం లభించినట్లవుతుంది. కాగా యశోద ఆసుపత్రి యాజమాన్యా నికి కొంత సమయమిచ్చి ప్రస్తుతం మిగిలిపోయిన లాన్‌ను సైతం తొలగిస్తా మని ఎసిపి రాజ్‌కుమార్ ప్రభాతవార్త ప్రతినిధికి తెలిపారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన రహదారిలో కొన్ని అడ్డంకులు ఉన్నందున వాటిని కూడా తొలగించి రోడ్డును పూర్తిస్థాయిలో పునరుద్దరించనున్నామని తెలిపారు.

## ఎన్నికల నిర్వాహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లాలో మొత్తం 45,70,138 మంది ఓటర్లు**

**1675 లోకేషన్స్‌లో 3986 పోలింగ్ బూతుల**

**-జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్**



సమావేశంలో మాట్లాడున్న రోనాల్డ్‌రోస్, సిపి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి

హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త: నగరంలో ప్రశాంతమైన వాతావరణంలో ,సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నా మని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అదికారి జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలుబడిన సందర్భంగా శనివారం సాయంత్రం జిహెచ్ఎంసి ప్రధాన కార్యలయం పన్వర్‌హాల్‌లో సిపి శ్రీనివాస్‌రెడ్డితోకలిసి విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎలక్షన్స్ షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియామావళి శనివారం నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసిందని,తెలంగాణలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలుబడుతుందన్నారు. ఏప్రిల్ 25వరకు నామినేషన్లు స్వీకరిస్తాని, 26న స్క్రూట్‌ని, 29న విత్‌డ్రాల్ ఉంటాయని ,మే 13న పోలింగ్ జరుగుతుందన్నారు. హైదరాబాద్ పార్లమెంట్‌కు ఆర్ వోగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, సికింద్రాబాద్ పార్లమెం ట్‌కు హైదరాబాద్ జిల్లా అదనపు కలెకస్టర్ హేమంత్ పాటిల్ ఆర్‌వోలుగా వ్యవహరిస్తారని అన్నారు. జిల్లాలో రెండు (హైదరాబాద్, సికింద్రాబాద్) పార్లమెంట్ నియోజకవర్గాల్లో 15అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయని వివరించారు. జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు గానూ మేడ్చల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న హైదరాబాద్ జిల్లాలోని కంటో న్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గా నికి ఉప ఎన్నికలు నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో అక్కడ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, వీడియో సర్వేలైన్స్ బృందాలు పనిచేస్తాయని వివరించారు. జిల్లాలో మొత్తం 45,70,138 మంది ఓటర్లు ఉన్నారని, 1675 లోకేషన్స్‌లో ,3986 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం ఓటర్లలో 22,39,240 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఓటరు నమోదు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని నామినేషన్‌కు పదదిరోజుల ముందు వరకు 18ఏళ్లు నిండిన అర్హత ఉన్న ఓటర్లు నమోదు చేసుకోవ చ్చునన్నారు. షిఫ్టింగ్ ఓటర్ల ప్రక్రియ కూడా ఏప్రిల్ 14వరకు తీసుకుంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌అనుదీప్ దురిశెట్టి, ఈవీడిఎం ప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం కూచిపూడి రంగప్రవేశం



రవీంద్రభారతి, మార్చి 16 ప్రభాతవార్త : అక్షద డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాట్యగురువు నిహంత్రిరెడ్డి శిష్యురాలు మహతి సూరి కూచిపూడి రంగప్రవేశం శనివారం రాత్రి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో నేత్రపర్వం కావించింది. ఈ సందర్భంగా మహతి ముందుగా తన కూచిపూడి రంగప్రవేశ ప్రదర్శనను సంప్రదాయ ప్రార్థనతో ప్రారంభించి, గౌళరాగం ఆదితాళంలో ప్రమామ్యహం, భామాకలాపం, ఖామాస రాగం ఆదితాళంలో జావళి, అకిలాండేశ్వరి, చివరిగా తిల్లా నా అంశాలను అద్భుత హావభావాలు, నాట్యవి న్యాసాలతో ప్రద ర్శించి ఆహుతులను తన్మయుల్నిచేసి మంత్రముగ్ధులను చేసింది.

## ఆస్తి పన్నులు చెల్లించండి.. అభివృదిలో భాగస్వాములు కాండి

**బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర**

నార్సింగి, మార్చి 16 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని ప్రజలంతా ఆస్థి పన్నులు చెల్లించండి..



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని పలు వార్డులలో పర్యటించి ఆస్థిపన్ను చెల్లించాలని ప్రజలకు అవగావాన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

అభివృద్ధిలో భాగస్వాములు కాండని కమీషనర్ శరత్ చంద్ర పిలుపునిచ్చారు. శనివారం కార్పోరేషన్ పరిధిలోని 9.వ,వార్డులోని కిస్మత్‌పూర్, 11.వ,వార్డులోని దర్గా ఖలీజ్ ఖాన్, 17వ వార్డులోని ప్రశాంత్‌నగర్ కాలనీ తదితర ప్రాంతా లలో బిల్‌కలెక్టర్లను వెంటబెట్టుకొని కమీషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా కాలనీలలోని ప్రజలతో మాట్లాడుతూ మీరంతా స్వచ్ఛందంగా, సకాలంలో ఇంటి పన్ను లు చెల్లిస్తుండడం వల్లనే మన కార్పోరేషన్ పరిధిలో వేగంగా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు.

## కవిత అరెస్టుకు వ్యతిరేకంగా ధర్నా, నిరసన



ధర్నాలో పాల్గొన్న కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ లావణ్యా శ్రీనివాస్‌గౌడ్, ఎడ్ల సుధాకర్

హైదరాబాద్, మార్చి 16 ప్రభాతవార్త: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టుకు నిరసనగా శనివారం అంబర్‌పేట, ఆలీకేఫ్ చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ రాజకీయ కుట్రలో భాగంగానే కవితను అరెస్టు చేసి మాజీ సిఎం కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టాలని, తెలంగాణ ప్రజలపై కక్ష సాధించాలని కేంద్రం చూస్తున్నదని ఆరోపించారు. ఒకవైపు కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నందున అరెస్టు చేయబోమని సుప్రీంకోర్టు కు మాట ఇచ్చిని ఈడి అధికారులు కవిత ఇంట్లో సోదాలు నిర్వహించి అరెస్టు చేయడం దారుణమన్నారను. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎడ్ల సుధాకర్, దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి, చంద్రమోహన్, మేడి ప్రసాద్, భీష్మదేవ్, సిద్ధార్థ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మే 13న కంటోన్మెంట్ ఉప ఎన్నిక

**పార్లమెంట్ ఎన్నిలతో పాటే..**

హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికలతోపాటే మే 13న జరగనున్నాయి. ఎమ్మెల్యే లాస్య నందిత ఇటీవల రోడ్డుప్రమాదంలో మరణించారు. ఈనేపథ్యంలో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వాహణకు ఈసిఐ షెడ్యూల్ ప్రకటించింది. నాలుగో దశలో తెలంగాణ ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. ఉప ఎన్నికకు ఆరోజు నుంచి ఏప్రిల్ 25వరకు నామి నేషన్లు స్వీరించనున్నారు. ఏప్రిల్ 26న పరిశీలన, ఉపసంహారణకు ఏపిల్29, మే13న ఎన్నికలు నిర్వహించి జూన్ 4న ఫలితాలు ప్రకటించనున్నారు.

## మాజీ సైనికులకు అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 55ను సవరించాలి



ధర్నాలో నినాదాలు చేస్తున్న తెలంగాణ మాజీ సైనికులు

ధర్నాచౌక్, మార్చి 16, ప్రభాతవార్త: తెలంగాణ మాజీ సైనికులకు అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 55ను తక్షణమే సవరించాలని తెలంగాణ మాజీ సైనికులు బి.సురేందర్‌రెడ్డి, వి.రవి కుమార్, సంజీవ్ కుమార్‌లు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వారు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి వారు మాట్లాడుతూ మాజీ సైనికుల ఉద్యోగాలపై మరణశాసనం 2022, ఏప్రిల్‌లో తెచ్చిన జీవో నెంబర్ 55 అని ఆరోపిం చారు. ఈ జీవో వల్ల టీఎస్‌పీఎస్సీ గ్రూప్ 4 నోటిఫికేష న్‌లో తెలంగాణ మాజీ సైనికులకు క్వాలిపై మార్కులు 30శాతం నుండి 40శాతంకు గత ప్రభుత్వం పెంచిం దని, దీనివల్ల మాజీ సైనికులు అనేక మంది ఉద్యోగాలకు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భరతమాత సేవలో సుమారు 20 సంవత్సరాల తరువాత పదవీ విరమణ పొందిన మాజీ సైనికులకు నీళ్లు నిధులు నియామకాలు అనే నినాదంతో ఏర్పడ్డ మన తెలంగాణలో ఈ విధంగా అన్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సుజీత్‌కుమార్, చాడ శేషుకుమార్‌రెడ్డి, ఆర్.నరేందర్, ఆంజనేయులు కుమార్ పాల్గొన్నారు.

## కవిత అరెస్టుతో కుత్బుల్లాపూర్‌లో నిరసన సెగ

**ఉద్యమస్ఫూర్తితో మరింత ఉధృత ఆందోళన: శంభీపూర్ కృష్ణ**




జీడిమెట్ల పోలీసుల అదుపులో శంభీపూర్ కృష్ణ, కార్పొరేటర్లు, కార్యకర్తలు

కుత్బుల్లాపూర్, మార్చి 16 ప్రభాతవార్త: తెలంగాణకోసం చావునోట్లో తలపెట్టి సాధించిన బిఆర్ఎస్ రానున్న రోజుల్లో మరింత ఉద్యమస్పూర్తితో కదనరంగంలో దూకుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు శంబీ పూర్ కృష్ణ హెచ్చరించారు. తెలంగాణ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితను ఇడివిభాగం అరెస్టుకు నిరసనగా బిఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా భారీకార్యకర్తల సమూహంతో ఆందోళన నిర్వహించి జీడిమెట్ల పోలీ స్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టులతో బెదిరింపు లకు గురిచేయాని చూస్తే ఉధ్యమం మరింత ఉధృతం కాకతప్పదని హెచ్చరించారు. కార్పొరేటర్లు రావుల శేషగిరిరావు, కొలుకుల జగన్, మంత్రి సత్యనా రాయణ, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు మహ్మద్ రఫీ, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేశ్‌రెడ్డిలతో పాటు కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవ్గ పరిధి లోని వివిధ విభాగాల నేతలు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమంలో పాల్గొనగా జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదోళనకారులను బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శంభీపూర్ కృష్ణ మాట్లాడుతూ కల్వ కుంట్ల కవితను ఇడి విభాగం అరెస్టుచేయడం బిజెపి, కాంగ్రెస్ పార్టీల కుట్ర అన్నారు. ఆందోళన లో టిఆర్ఎస్ నాయకులు నదీమ్‌రాయ్, బండారు వరప్రసాద్‌గుప్తా, కుత్బుల్లాపూర్ టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్ యాదవ్, కుంట సిద్దిరాములు, చింతల్ డివిజన్ అధ్యక్షులు మహ్మద్‌రఫీ, కస్తూరి బాల్‌రాజ్, ఎత్తరి మారయ్య, పుప్పాల బాస్కర్, సంపతి మాధవరెడ్డి, మక్సూద్‌అలీ, మెహరున్నిస్సా బేగం, ఏర్వ శంకరయ్య, సతీష్ ఘట్కొజిలతోపాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు ఆందోళనలో పాల్గొన్నారు.

# పశువుల షెడ్లు, గదుల కూల్చివేతలపై ఆందోళన

## జిఓ 59 కింద దరఖాస్తు చేసిన వాటిని కూల్చడంపై బాధితుల అభ్యంతరం

## కాంగ్రెస్ నేతలు కక్షపూరితంగా కూల్చివేయించారని ఆరోపణ



పశువుల షెడ్లు, గదుల కూల్చివేతలపై నిరసన వ్యక్తం చేసి ఆందోళన వ్యక్తం చేస్తున్న రామిడి తూఫాన్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం అల్మాస్‌గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 86/1 భూమిలో దాదాపు ముప్పయి సంవత్సరాలుగా కబ్జాలో ఉంటూ ఏర్పాటు చేసుకున్న పశువుల పాకలను, గదులను కూల్చివేయడం అన్యాయమని గ్రామానికి చెందిన రామిడి తూఫాన్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, రామిడి ముత్యంరెడ్డిలు ఆందోళన వ్యక్తం చేశారు. రెండుసార్లు ప్రభుత్వ జిఓ 59 కింద సదరు భూమిలో నిర్మించుకున్న పశువుల పాకలను, గదులను క్రమబద్ధీకరించాలని లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి చెల్లించి దరఖాస్తు చేసుకొన్నప్పటికీ అంతే కాకుండా తమకు ఇంటి నెంబర్లు, విద్యుత్ మీటర్లు ఉన్నప్పటికీ కూల్చివేతలు జరిపారని వారు ఆరోపించారు. శనివారం తెల్లవారు జామున బాలాపూర్ మండల రెవెన్యూ సిబ్బంది కూల్చివేతలు జరిపిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్మాస్‌గూడలో తమ పట్టా భూమి అయిన సర్వే నెంబర్ 105కు ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 86/1 పోరంబోకు భూమిలో తమ పెద్దలు రామిడి అంతిరెడ్డి, ముత్యంరెడ్డి, బిక్షపతిరెడ్డిలు 1994లోనే మూడు పశువుల పాకలను నిర్మించుకొని వాటికి విద్యుత్ మీటర్లు మంజూరు చేసుకొని గ్రామ పంచాయతీనుండి 9-2/1, 9-2/2, 9-2/3 ఇంటి నెంబర్లు కూడా తీసుకొని పన్నులు చెల్లిస్తూ వస్తున్నారని వివరించారు. సుమారు 50, 60 గేదెలు, ఆవులు ఉన్న పశువుల పాకల క్రమబద్ధీకరణ కోసం 2015, 2022లో రెండు సార్లు ఒకో పాకకు రూ.1.55 లక్షల చొప్పున చెల్లించి జిఓ నెంబర్ 59 కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేయడం జరిగిందని వారు వివరించారు. అయితే కొందరు కాంగ్రెస్ నాయకులు కక్ష పూరితంగా చేసిన ఫిర్యాదు కారణంగా శనివారం తెల్లవారు జామున రెవెన్యూ సిబ్బంది వందలాది మంది పోలీసు బందోబస్తు మధ్య వచ్చి అన్యాయంగా కూల్చివేతలు జరిపారనీ ఈ కూల్చివేతల్లో గేదెలకు కూడా గాయాలయ్యాయని వాపోయారు. ఎలాంటి నోటీసులివ్వకుండా క్రమబద్ధీకరణకోసం దరఖాస్తుచేసి ఉన్న పశువుల షెడ్లను, గదులను కూల్చివేయడం శోచనీయమని వారన్నారు. కూల్చివేతల వల్ల పశువులకు గాయాలు, వాటి దాణా కూడా ధ్వంసం అయ్యిందనీ దీంతో పశువులకు నీడ లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరారు.

## నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన రాచకొండ సిపి డాక్టర్ తరుణ్ జోషి



నేరెడ్‌మెట్ పోలిస్‌స్టేషన్‌లో రాచకొండ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి..

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సిబ్బంది పనితీరు, సామాన్యులకు సేవలు అందించడంలో తాము ఎల్లప్పుడు ప్రాధాన్యత వహిస్తామని రాచకొండ పోలీస్ కమీషనర్ డాక్టర్ తరుణ్ జోషి పేర్కొన్నారు. శనివారం రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని మల్కాజిగిరి జోన్ నేరెడ్‌మెట్ పోలిస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పోలీసు సిబ్బంది వ్యవహరించాలన్నారు. ప్రజలతో మమేకమై పోలీసులు పనిచేయాలని సూచించారు. బాధితులు పోలిస్‌స్టేషన్‌కు వచ్చి ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే సత్వరమే స్పందించి తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసిపి పద్మజారెడ్డి, ఏసిపి, సీఐ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత అరెస్టు అక్రమం: సామ స్వప్న



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న సామ స్వప్న సుందర్‌రెడ్డి

**సైదాబాద్, మార్చి 16 ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్ చౌరస్తాలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సామ స్వప్న మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒకరోజు ముందు అరెస్టు చేయడం కుట్రలో భాగమేనన్నారు. సుప్రీంకోర్టులో 19వ తేదీన కేసు వాయిదా ఉండగానే హడావిడిగా అరెస్టు చేయాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు.

## రక్తదానం చేయడంతో మరొకరికి ప్రాణదానం : ప్రొఫెసర్ కోదండరాం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రొఫెసర్ కోదండరాం, గంగుల గోవర్ధన్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారం అవుతామని ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి కోదండరాం, న్యాయ కళాశాల కన్వీనర్ గంగుల గోవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు విరివిగా రక్తదానం చేయాలని సూచించారు. నిత్యం రక్తదానం చేయడం వల్ల మరింత ఆరోగ్యకరంగా ఉంటారని తెలిపారు. సకాలంలో రక్తం దొరకక అనేకమంది తమ నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఎటువంటి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి ఎందరికో ఆదర్శంగా నిలవడంతో పాటు మానవత్వాన్ని చాటుకుంటున్నారని అన్నారు. రక్తదానం చేసిన వారికి కోదండరాం సర్టిఫికెట్లను అందజేశారు. సుమారు వందమంది యువకులు రక్తదానం చేసినట్లు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. అంతకుముందు 2019లో పుల్వామా ఘటనలో అమరులైన వారికి వారు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సత్యం, అధ్యాపకులు శ్రీలక్ష్మి, సుధా, దేవి విద్యార్థులు పాల్గొన్నారు.

## పెన్షనర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి : వినయ్‌కుమార్



చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వినయ్‌కుమార్ తదితరులు

**మలక్‌పేట, మార్చి 16 ప్రభాతవార్త:** పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో సత్వరమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ మలక్‌పేట, సలీంనగర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం పిఆర్‌ఎసి చైర్మన్ శివశంకర్‌కు వినతి పత్రాన్ని అందజేసారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో పెన్షనర్స్ సమస్యల పరిష్కారంకోసం పెన్షనర్స్‌తో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చైర్మన్ హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్, కోశాధికారి దామోదర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా రామంతాపూర్‌లో ధర్నా



ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న జ్యోత్స్న నాగేశ్వర్‌రావు

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌కు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పార్టీ నేతలు ధర్నా నిర్వహించారు. ఉప్పల్, చిలుకానగర్, రామంతాపూర్, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో పార్టీ నేతలు రోడ్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రామంతాపూర్‌లో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోసమే బిజెపి నేతలు అక్రమ అరెస్ట్‌లు చేపడుతున్నారని, కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌నేతలు పసుల ప్రభాకర్‌రెడ్డి, ఎం.డి.ముస్తాక్, సంపత్‌రావు, సూరం శంకర్, కె.నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, బోసాని పవన్‌కుమార్, శ్రీకాంత్‌గౌడ్, రమేష్, స్వప్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో చిలుకానగర్ చౌరస్తాలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. హబ్సిగూడలో డివిజన్ అధ్యక్షుడు డా.బి.వి.చారి, కార్యదర్శి సోమిరెడ్డి ఆధ్వర్యంలో బిజెపి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## విజయ హై స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే



పాఠశాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**కుషాయిగూడ, మార్చి 16 ప్రభాతవార్త :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసి భావి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల బోధనలో ఆదర్శనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా లోగల విజయ హై స్కూల్ యూకేజీ తరగతి చిన్నారుల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు" చిన్నతనం నుండే ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని అదే బాట లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విజయ హై స్కూల్‌లో యాజమాన్యాన్ని అభినందించారు. గౌరవఅతిథి కాప్రా మున్సిపల్ కార్పోరేటర్ శ్రీ స్వర్ణరాజ్ శివమణి కాప్రా మైనారిటీ సెల్ అధ్యక్షులు బద్రుద్దీన్ పాఠశాల కరెస్పాండంట్ శ్రీ కొప్పునూరి రాజేశ్వర్ డైరెక్టర్ కొప్పునూరి వీణా, ప్రిన్సిపాల్ వెంగబాబు, ప్రధానోపాధ్యాయురాలు ఎం.వి.పద్మావతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి : కౌన్సిలర్ ఉదయశ్రీరెడ్డి

**తుర్కయంజాల్, మార్చి 16 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించటం మంచి పరిణామమని 20 వ వార్డు కౌన్సిలర్ కుంట ఉదయశ్రీగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం 20వ వార్డులో చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి ఆదేశాలమేరకు 35మంది పారిశుధ్య సిబ్బందితో, సూరజ్ నగర్, రాఘవేంద్ర నగర్, గంగాధర రెసిడెన్సీ, కెఎస్ఆర్‌నగర్, శ్రీశ్రీ విహార్, బాలాజీనగర్, పాటిగూడలో పలు కాలనీలలో శుభ్రపరిచారు. రోడ్డుకిరువైపుల ఉన్న పొదలను తొలగించి, జెసిబి సహాయంతో గుంతలను పుడ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. కాలనీ వాసులంతా చెత్తను బయట వేయరాదని, పురపాలక స్వచ్ ఆటోకి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్, నాగేష్, ఇఇ హారీష్, జవాన్ మధు స్థానిక కాలనీ వాసులు మరియు మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్‌ను వెంటనే కూల్చివేయాలని జలమండలి ఎండికి వినతి

### ప్రమాదం పొంచి ఉంది - చర్యలు చేపట్టండి



శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్‌ను పరిశీలిస్తున్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** దశాబ్దాల క్రితం నాటి మంచినీటి ట్యాంకును వెంటనే కూల్చివేయాలని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కొత్తపేట న్యూమారుతినగర్‌లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయం ప్రాంగణంలో ఉన్న 30 సంవత్సరాల క్రితం నాటి మంచినీటి ట్యాంకర్ వాడుకలో లేకపోవడం వల్ల శిథిలావస్థకు చేరింది. గత 20 సంవత్సరాలకుపైగా మంచినీటి ట్యాంకు వాడకంలో లేకపోవడంతో దేవాలయం ప్రాంగణంలో ప్రమాదకరంగా మారింది. ఈ విషయమై దేవాలయం నిర్వాహకులు మల్‌రెడ్డి రాంరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా శనివారం రామ్‌రెడ్డి సందర్శించి శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితమే శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్ విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. దశాబ్దాల క్రితం నాటి ట్యాంకర్ పూర్తిగా శిథిలావస్థకు చేరిందని ట్యాంకర్ కూలిపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్‌ను వెంటనే కూల్చివేయాలని జలమండలి ఎండి సుదర్శన్‌రెడ్డికి కూడా విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయని, స్వామివారి దర్శనం కోసం కూడా ప్రతిరోజు పెద్దఎత్తున భక్తులు వస్తారని ప్రమాదకరంగా ఉన్న ట్యాంకర్‌ను వెంటనే కూల్చివేసే విధంగా చర్యలు చేపట్టకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వెంటనే శిథిలావస్థలో ఉన్న ట్యాంకర్ ను కూల్చివేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతామని తెలిపారు.

## రామంతాపూర్‌లో ఐలమ్మ విగ్రహావిష్కరణ



ఐలమ్మ విగ్రహాన్ని అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, గంధం జ్యోత్స్న తదితరులు

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రామంతాపూర్ డివిజన్ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావులతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హజరై అవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం దశాబ్దాల క్రితమే చాకలి ఐలమ్మ పోరాటం చేసారని, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఉద్యమం సాగించారని కొనియాడారు. చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సేవాసంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి లింగమయ్య, బిఆర్ఎస్ సీనియర్ గంధం నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సూరం శంకర్, చాంద్‌పాషా, బోసాని పవన్ కుమార్, ఎం.శ్రీనివాస్, పి.శ్రీకాంత్‌గౌడ్, రత్నం, ఆనంద్, అపిల్ శ్రీనివాస్, మహిళా నాయకురాలు స్వప్న, కె.లక్ష్మి, సబిత తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలి : కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్



కాలనీలో పర్యటిస్తున్న పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, మార్చి 16 ప్రభాతవార్త:** రోడ్డు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తపేటగ్రామంలో నూతన భూగర్భ డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసి చాలా రోజులు గడుస్తున్న రోడ్డు మరమ్మతు చేయకపోవడంతో కాలనీలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పవన్‌కుమార్ దృష్టికి తీసుకురాగా శనివారం ఆయన కొత్తపేటలో పర్యటించి సమస్యను పరిశీలించారు. వెంటనే సంబంధిత జలమండలి అధికారులతో మాట్లాడి డ్రైనేజ్ లైన్ వేసిన చోట రోడ్డు ప్యాచ్‌వర్క్ చేయాలని అధికారులకు సూచించారు. ప్యాచ్‌వర్క్ పనులు చేపడతామని జలమండలి అధికారులు అంగీకరించారని తెలిపారు. పనులు త్వరగా పూర్తి అయ్యేలా చేస్తామని అన్నారు, అనంతరం కాలనీలో విద్యుత్ తీగలు. విద్యుత్ దీపాల సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందర్‌నారాయణ, మహేందర్‌యాదవ్, గోపాల్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అరోగ్య సంరక్షణకోసం వైద్యశిబిరాలు దోహదపడతాయి : ఎండి శ్రీనివాస్



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**మలక్‌పేట, మార్చి 16 ప్రభాతవార్త:** అరోగ్య సంరక్షణకోసం వైద్యశిబిరాలు దోహదపడతాయని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మూసారాంబాగ్ శాలివాహననగర్‌లోని పాఠశాలలో ఎండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్, అంకుర ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో పలు వైద్యపరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కృష్ణ, విద్య, జహీర్, మహిదీష్, అంకుర ఆసుపత్రి డైరెక్టర్ శ్రీనిధి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ ప్రియంకసింగ్, బ్రాహ్మణ పరిషత్ నాయకులు కృష్ణచైతన్యగుప్త, ప్రశాంత్, పవన్, శిరీష్, సతీష్, చకిలం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ కళాశాలలో బోర్‌వెల్ పనుల ప్రారంభం : ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



ప్రభుత్వ కళాశాలలో బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల విషయంలో ఎటువంటి జాప్యం చేయమని, సమస్య ఉందని తెలిసిన వెంటనే పరిష్కారం కోసం కృషి చేస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని వాజ్‌పేయినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్ పనులను ఆయన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శైలజ, బి.ఆర్.ఎస్ నాయకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్య తన దృష్టికి రావడంతో సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చించి బోర్‌వెల్ పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారిగా పరిష్కరించడమే తన ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, వైస్‌ప్రిన్సిపల్ బండిరాజు, అధ్యాపకులు శ్రీనివాసులు, బ్రిజేష్, రమేష్, చంద్రయ్య, గుణాకర్ మల్లిక, మల్కాజిగిరి నియోజకవర్గ బి.ఆర్.ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, నాయకులు బద్దం పరుశురామ్‌రెడ్డి, రావుల అంజయ్య, రాము యాదవ్, జి.కె హన్మంత్‌రావు, ఖలీల్, మధు, సుదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రఘుమారెడ్డి, రాజిరెడ్డి

**సైదాబాద్, మార్చి 16 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి తన తండ్రి రాంరెడ్డి జ్ఞాపకార్థం కర్మన్‌ఘాట్‌లోని కేంద్ర ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటనర్సింహారెడ్డి, బిఆర్ఎస్ యువజన విభాగం ఎల్బినగర్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, డివిజన్ మహిళా విభాగం అధ్యక్షురాలు శాగ రోజారెడ్డి, నాయకులు చేగోని మల్లేష్‌గౌడ్, ఉమామహేశ్వర్, బొంబాయి యాదయ్య, చీర తిరుమలేష్, శివగౌడ్, జగదీష్, రాజు, యాదగిరి, వసంత తదితరులు పాల్గొన్నారు.

## స్మశానవాటికల అభివృద్ధికి నిధులు : ఎంపిఆర్



మంజూరైన నిధుల పత్రాన్ని అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని చిలుకానగర్ డివిజన్‌లో కురుమ, రెడ్డి, ముస్లిం, స్మశానవాటికల అభివృద్ధికి రూ.55లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం స్మశానవాటికలకు మంజూరైన నిధుల పత్రాలను ఆయా కమిటి సంఘం నేతలకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లోని మూడు కుల సంఘాలకు నిధులు మంజూరుచేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. మిగతా ప్రాంతాల అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి తన వంతు తోడ్పాటు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కుల సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## రాజకీయ లబ్ధికోసమే ఎమ్మెల్సీ కవిత అరెస్టు



మోది దిష్టిబొమ్మతో నాచారం బీఆర్ఎస్ నాయకులు

**నాచారం, మార్చి 16 ప్రభాతవార్త :** రాజకీయ లబ్ధికోసమే ఎమ్మెల్సీ కవితను బిజేపీ అరెస్టు చేయించిందని నాచారం బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు శనివారం నాచారం వైజయంతి టాకీస్ వద్ద ప్రధాని నరేంద్రమోది దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బిజేపీ రాష్ట్రంలో చేస్తున్న కుటిల రాజకీయాలను రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తిప్పికొడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల ముత్యంరెడ్డి, కొరపాక అంజి, మేడల మల్లికార్జున్‌గౌడ్, రమణారెడ్డి, అశ్వద్దామరెడ్డి, భూపాల్‌రెడ్డి, ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి, దాసరి కర్ణ, విఠల్‌యాదవ్, మారయ్య, ప్రీతి రెడ్డి, మంగోల్ శివ కుమార్, వియజ్ కుమార్‌గౌడ్, కట్ట బుచ్చన్నగౌడ్, శ్రీనివాస్, టేకి రాజశేఖర్, బాలరాజు, అశోక్, యాదగిరి, సంజన్న, రమేష్, కెప్టెన్, భాగ్య, చంద్రశేఖర్ తధితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్ కాంగ్రెస్ అధ్యక్షునిగా రాజేష్

**ఉప్పల్, మార్చి 16 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ములకపల్లి రాజేష్ ముదిరాజ్ నియమితులైయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిల నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీ అధ్యక్షుడు ములకపల్లి రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందని, తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.